క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

బోట్‌క్లబ్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాలు సోమవారం నిర్వహించనున్నట్టు కమిషనర్ భావన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకూ డయల్ యువర్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చున్నారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నేరుగా ప్రజలు సమస్యలపై అర్జీలను అందించవచ్చని పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఏజీఎం హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం హరిప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక రమణయ్యపేట శ్రీచైతన్య పాఠశాలలో బీవీ రావు మెమోరియల్ కాకినాడ జోన్ స్పోర్ట్స్ మీట్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ మాట్లాడుతూ క్రీడలు మనిషికి శారీరక, మానసిర ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. పాఠశాల ఆర్ఐ గోపీనాథ్ క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యత వివరించారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, పీఈటీలు పాల్గొన్నారు.

కృత్రిమ దంతాలతో ఎంతో ఉపయోగం


బోట్‌క్లబ్: కృత్రిమ దంతాలతో ఆహారాన్ని బాగా నమిలి తినగలమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని సత్య డెంటల్ క్లినిక్‌లో ఆదివారం జాతీయ కృత్రిమ దంతాల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కృత్రిమ దంతాలు అనేవి కోల్పోయిన దంతాలను భర్తీ చేయడానికి వాడతారన్నారు. వృద్ధాప్యం, చిగుళ్ల వ్యాధి, గాయం, ఇతర కారణాల వల్ల దంతాలు కోల్పోయిన వ్యక్తులకు ఇవి గొప్ప పరిష్కార మార్గమన్నారు. ఒక వ్యక్తి సహజ దంతాలన్నీ లేనప్పుడు పూర్తిగా కృత్రిమ దంతాలను అమర్చుతామని తెలిపారు. ఈ దంతాలు చిగుళ్ల రంగుకు అనుసంధానించబడిన కృత్రిమ దంతాల పూర్తి సెట్‌ను కలిగి ఉంటాయన్నారు. పాక్షిక దంతాలు మీ చిరునవ్వు రూపాన్ని మెరుగుపరుస్తాయన్నారు. అసోసియేషన్ సభ్యులు రఘురామ్ మాట్లాడుతూ కృత్రిమ దంతాలు సరిగ్గా తినడానికి, మాట్లాడే సామర్థ్యాన్ని పునరుద్ధరించగలవన్నారు. దంత సమస్యలను నివారించగలవన్నారు. సహజ దంతాలు లేకుంటే, ఉత్తమమైన కృత్రిమ దంతాల రకాన్ని నిర్ణయించడానికి దంతవైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

వృద్ధులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ


రమణయ్యపేట ఆశ్రయ ఆశ్రమంలో వృద్ధులకు వస్త్రాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆశ్రయ వృద్ధుల ఆశ్రమంలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఆశ్రమంలోని వృద్ధులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు ఎంవీఎస్ఎల్ ప్రసూన మాట్లాడుతూ మనదేశంలో విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు కనిపిస్తాయని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళల్లో చైతన్యం రావాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టరు సరోజ, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ విశ్వేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి శ్రీదేవి, శ్రీవాణి, నాగిరెడ్డి లక్ష్మి, ముత్తా రాజేశ్వరి, రమాసుందరి, మీనాక్షి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు


పిఠాపురంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో అంకురార్పణ నిర్వహిస్తున్న వేద పండితులు

పిఠాపురం: పిఠాపురంలో వేంచేసియున్న పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 15వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

జోరుగా కొబ్బరి బొండాల వ్యాపారం

- కొబ్బరి నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు
- వేసవిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు
- నగరం, గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా బొండాల విక్రయాలు
- ఊపందుకున్న కొబ్బరి జ్యూస్ వ్యాపారం



కాకినాడ సిటీ: తీర ప్రాంతమైన కాకినాడ జిల్లాలో వేసవి తాపం రోజురోజుకూ పెరుగుతోంది. ప్రజలు దాహార్తి తీర్చుకునేందుకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సూర్యప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు నగర వాసులు కొబ్బరి నీళ్లను తీసుకుంటున్నారు. వేసవిలో కొబ్బరి బొండం నుంచి నేరుగా కొబ్బరి నీళ్లు తాగడం ద్వారా సాంత్వన లభిస్తుందని నగర వాసులు అంటున్నారు. దీని వల్ల ఉపశమనమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయని వైద్యులు తెలిపారు. కొబ్బరి నీటిలో విటమిన్లు, మినరల్స్, ఎలక్ట్రోలైట్స్, ఎంజైమ్‌లు, ఎమినోయాసిడ్లు, సైటోకిన్ అధికంగా ఉంటాయి. శరీరానికి వేసవి నుంచి ఉపశమనం ఇచ్చే నీళ్లు రుచికి వగరుగా ఉన్నా ఆరోగ్యానికి ప్రయోజనాలను ఎన్నో కల్పిస్తున్నాయని వారంటున్నారు. ఈ నీరు తాగడం వల్ల శరీరం నష్టపోయిన ఫ్లూయిడ్స్‌ను భర్తీ చేస్తాయంటున్నారు. ఈ ఏడాది వేసవిలో తీర ప్రాంతమైన కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఎండల తీవ్రత అధికమైంది. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు మండిపోతుండడంతో కాలు బయట పెట్టాలంటే ప్రజలు వణికిపోతున్నారు. బయటకు వచ్చిన వారు ఉష్ణతాపాన్ని తట్టుకునేందుకు చల్లని పానీయాల దుకాణాల వైపు పరుగులు తీస్తున్నారు. ఎండలో బయటకు వచ్చిన వారు శీతల పానీయాలను సేకరించడం కన్నా కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ వంటి పానీయాలను తీసుకోవడం మేలని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్ల ఎలక్ట్రోలైట్ పొటాషియం అధికంగా కలిగి ఉండడం వల్ల ఇది శరీర ద్రవాల్లో ఎలక్ట్రోలైట్‌ని తిరిగి భర్తీ చేస్తుందని సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో పొటాషియం ఎక్కువగా ఉండడం వల్ల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. గుండెపోటు ప్రమాదాలను తగ్గించడానికి ఉపయోగపడుతుందని వైద్యులు అంటున్నారు.

నగరం పరిధిలో విస్తృతంగా వ్యాపారం

కొబ్బరి బొండాల వ్యాపారం నగరంలో విస్తృతంగా జరుగుతోంది. స్థానిక వ్యాపారులు కొబ్బరి బొండాలను ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కొనుగోలు చేసి ఇక్కడికి రప్పిస్తున్నారు. ముఖ్యంగా నీరు అధికంగా ఉండే బొండాలకు అధిక ధర చెల్లించి నగరానికి రప్పిస్తున్నారు. కాకినాడ నగరంలో ఆస్పత్రులు అధికంగా ఉండటంతో రోగులకు కొబ్బరి నీరు ఇచ్చేందుకు సాధారణ రోజుల్లోనూ బొండాల కొనుగోలు అధికంగా ఉంటుంది. వేసవి తాపం ప్రారంభం కావడంతో బొండాల వ్యాపారం మరింత పుంజుకుంది. ఇటీవల నగరం పరిధిలో కొబ్బరి జ్యూస్ వ్యాపారం జోరందుకుంది. కొబ్బరి నీటితోపాటు లేత గుజ్జు తీసి అందులో గ్లూకోజ్, సబ్జా గింజలు ఇతర పొడర్లు కలిపి మిక్సీలో జ్యూస్ తయారు చేసి విక్రయిస్తున్నారు. నగరంలో కొబ్బరి బొండం ధర 25 నుంచి 35 రూపాయలకు విక్రయిస్తున్నారు. కొబ్బరి జ్యూస్ 50 నుంచి 60 రూపాయలకు, లీటరు కొబ్బరి నీటిని రూ.100 నుంచి 120కి విక్రయిస్తున్నారు. కొబ్బరి జ్యూస్ తాగేందుకు యువత, చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. సమీప గ్రామాల నుంచి కొందరు కొబ్బరి బొండాలను సైకిళ్లు, మోటార్ సైకిళ్లతో తీసుకువచ్చి నగరంలోని వివిధ ప్రదేశాల్లో తిరిగి విక్రయిస్తున్నారు.

కొబ్బరి నీళ్లలో ఉండే విటమిన్లు

కొబ్బరినీళ్లలో ఎలెక్ట్రోలైట్ పొటాషియం పుష్కలంగా ఉంటుంది. 100 మిల్లీలీటర్ల కొబ్బరి నీటిలో 250 మిల్లీ గ్రాముల పొటాషియం, 105 మిల్లీ గ్రాముల సోడియం లభిస్తాయి. ఈ రెండు ఎలెక్ట్రోలైట్లు కలిసి శరీరంలో విరేచనాలు వల్ల తగ్గిన ఎలెక్ట్రోలైట్లను పునరుత్పత్తి చేస్తాయి. తాజా కొబ్బరి నీళ్లలో కొంచెం సీ విటమిన్ కూడా ఉంటుంది. ఆర్‌డీఏలో 2.4 మిల్లీ గ్రాముల విటమిన్ సీ అందిస్తుంది. విటమిన్ సీ నీటిలో కరిగే యాంటీ ఆక్సిడెంట్.

కొబ్బరి నీళ్లతో తక్షణ శక్తి



వేసవిలో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. వేసవిలో అధిక ఎండల వల్ల చెమటతో శరీరంలోని నీరు బయటకు వెళుతుంటుంది. దీని వల్ల డీహైడ్రేషన్ అవుతుంది. కొబ్బరి నీరు తాగడం వల్ల తక్షణం మనకు కావాల్సిన నీటితో పాటు విటమిన్లు కూడ లభిస్తాయి. ఏ కాలంలో అయినా కొబ్బరి నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ ఐ ప్రభాకర్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా ప్రాజెక్టు అధికారి, కాకినాడ

నేడు నూతన ధ్వజస్థంభ ప్రతిష్ఠ


శ్రీరామచంద్రమూర్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని శ్రీరామచంద్రమూర్తి దేవస్థానంలో సోమవారం ఉదయం 9.20 గంటలకు రజిత ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పైండా రామకృష్ణారావు తెలిపారు. ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం, సాయంత్రం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. చామర్తి శ్రీనివాసాచార్యస్వామి, పొందూరు సీతారామనుజాచార్యస్వామి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామస్వామి కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి


రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లో విజయ సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా ఆదివారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం వాడపల్లి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తకంగా నిర్వహించారు. జీలకర్ర బెల్లం, తలంబ్రాలు, మాంగల్యధారణ మహోత్సవం వంటి ఘట్టాలు కనుల పండుగగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ సత్తెమ్మ తల్లి జాతర

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లో విజయ సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి పలు ఉత్సవాలు నిర్వహించారు.

డైమండ్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న పూర్వవిద్యార్థి చంటిబాబు

కరప: పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసి 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏప్రిల్ 26, 27 తేదీల్లో డైమండ్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పూర్వవిద్యార్థి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొండా చంటిబాబు తెలిపారు. పెద్దాపురప్పాడు హైస్కూల్లో ఆదివారం చంటిబాబు అధ్యక్షతన పూర్వవిద్యార్థులు సమావేశమై పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహణకు ఫైనాన్స్, సావనీర్, నిర్వహణ వంటి వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదివినవారు ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించిన వారు, వ్యవసాయదారులుగా పేరు ప్రఖ్యాతులు గడించిన వారున్నారు. దేశ, విదేశాల్లో ఉన్న పూర్వవిద్యార్థులందరినీ ఆహ్వానించేందుకు తీర్మానించారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు పూర్వవిద్యార్థులు, ఆహ్వాన కమిటీ సభ్యులు చిక్కం రామచంద్రరావు, బిరుదా శ్రీనివాస అప్పారావు, ఎర్రంశెట్టి కొండ, నల్లా సత్యనారాయణ, సలాది మూర్తి, తోట మూర్తి, అయిరెడ్డి సత్యనారాయణ, గొల్లపల్లి లక్ష్మణరావు, దేవు సదానందమూర్తి, తాడి మాచారెడ్డి, ఎర్రంశెట్టి కొండ తెలిపారు.

మద్యం షాపు ఏర్పాటుపై ఆందోళన


ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు మల్లవరం సెంటర్లో మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ పలువురు మహిళలు ఆదివారం ఆందోళన నిర్వహించారు. గ్రామంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తే వీధిలో మహిళలు, విద్యార్థినులు తిరగలేని పరిస్థితి నెలకొంటుందని, వెంటనే షాపు ఏర్పాటును నిలిపివేయాలని వారు డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని జన సంచారం లేని ప్రాంతంలో ముఖ్యంగా మహిళలకు ఇబ్బంది లేని ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేసుకోవాలని పలువురు మహిళలు అన్నారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేస్తే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

కన్నబాబు, గీతకు చిన్న జీయర్ స్వామి ఆశీర్వచనం


సర్పవరంలో చిన్న జీయర్‌తో వైఎస్సార్ సీపీ నేతలు కురసాల కన్నబాబు, వంగా గీత

కాకినాడ రూరల్: సర్పవరంలో రామాలయం మహా కుంభ సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్న చిన జీయర్ స్వామిని ఆదివారం ఉదయం వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటరు కురసాల కన్నబాబు, పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటరు వంగా గీత మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలకు చిన్న జీయర్ స్వామి ఆశీర్వచనాలు అందించారు.

సర్పవరం రామాలయంలో కొలువైన సీతారాములు


చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ఆలయ జీర్ణోద్ధరణ


సర్పవరం రామాలయంలో ప్రతిష్ఠాపన అనంతరం దర్శనమిస్తున్న సీతారాములు


రామాలయం గోపురంపై యంత్ర స్థాపన చేస్తున్న చిన్న జీయర్ స్వామి

కాకినాడ రూరల్: సర్పవరంలో సుమారు 160 ఏళ్ల చరిత్ర గలిగిన రామాలయంలో హనుమ, లక్ష్మణ సహిత సీతారామచంద్రస్వామి వార్ల విగ్రహాలు కొలువయ్యాయి. గ్రామానికి చెందిన పురాణం రామకృష్ణమాచార్యులు, వెంకటాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి చేతులు మీదుగా ఆలయ జీర్ణోద్ధరణ, మహాకుంభ సంప్రోక్షణ వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులు పాటు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చివరి రోజున యంత్ర స్థాపన, హోమాలు, దేవతామూర్తులు విగ్రహాలు స్థాపన, ద్వారతోరణ బలి, మహాపూర్ణాహుతి నిర్వహించారు. పునర్వసు నక్షత్రయుక్త వృషభ లగ్న సుమూహూర్తాన మహాకుంభ సంప్రోక్షణ, దృష్టి కుంభ, మంగళ ద్రవ్య దర్శనం, సీతారామకల్యాణం జీయర్ స్వామి నిర్వహించారు. సాయంత్రం శాంతి కల్యాణంతో కార్యక్రమాలు ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హిందువుల ఉత్సవాలపై పోలీసు జోక్యం సహించం


రాయచోటి ఘటనను ఖండిస్తున్న హిందూ సంఘ నాయకులు

బోట్‌క్లబ్: కేవలం హిందువుల ఉత్సవాలపైనే పోలీసు ఆంక్షలు, జోక్యం ఎక్కువగా ఉందని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆరోగ్యభారతి కార్యాలయంలో ఆదివారం వివిధ హిందూ సంఘాలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆర్ రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 4న వీరభద్రస్వామి ఉత్సవంపై ముస్లింలు దాడి చేస్తే వారిని అదుపు చేయడంలో విఫలమైన పోలీసులు హిందువులపై అమానుషంగా లాఠీ చార్జీ చేశారని మండిపడ్డారు. ఈ విషయంలో హిందువులపై కేసులు బనాయించినందుకు నిరశనగా సోమవారం ఉదయం స్థానిక బాలాజీచెరువు సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తామని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మాలకొండయ్య, అప్పాజీ, పెండెం శ్రీదేవి, గూటూరు పద్మ, తుమ్మల పద్మ పాల్గొన్నారు.

రమణయ్యపేటలో మెగా వైద్య శిబిరం


రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ మల్టీ సర్వీసు సెంటరులో మెగా వైద్య శిబిరంలో వైద్య సేవలు

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ మల్టీ సర్వీసు సెంటరులో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని లయన్ బాదం బాలకృష్ణ ప్రారంభించగా లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్టార్ క్లబ్ సభ్యుడు కొప్పర్తి సాయికృష్ణ సహాయంతో డీసీవీఎస్ఆర్ మూర్తి, డీసీవీఎస్ నాగిని పర్యవేక్షణలో మెడికవర్ ఆస్పత్రి, తులసి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో సుమారు 300 మంది బీపీ, సుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ ముంజులూరి విశ్వేశ్వరరావు, వినోద్, 2వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, జోనల్ చైర్‌పర్సన్ డాక్టరుగరికిపర్తి నమశ్శివాయ, లయన్స్‌క్లబ్ కాకినాడ స్టార్స్ ప్రెసిడెంట్ షర్మిల, కార్యదర్శి నాగేశ్వరి, కోశాధికారిణి నాగమణి పాల్గొన్నారు.

పలువురు మహిళలకు సత్కారం


కాకినాడ 2వ డివిజన్ తోట సుబ్బారావునగర్‌లో మహిళలను సత్కరించిన దృశ్యం

కాకినాడ రూరల్: మహిళా దినోత్సవ వేడుకలు కాకినాడ రెండో డివిజన్ తోట సుబ్బారావునగర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దుగ్గాడ కుమారి ఆధ్వర్యంలో పాలిక రెసిడెన్సీలో నిర్వహించిన ఈ వేడుకల్లో పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. వేడుకల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కడలి ఈశ్వరి, సివిల్ సప్లయిస్ స్టేట్ డైరెక్టరు కడలి ఈశ్వరి, కార్పొరేషన్ టీపీఆర్వో శైలజ, మెప్మా అధికారిణి మంగాదేవి, సరోజిని, ప్రశాంతి, గంగాభవానీ, తదితరులు సన్మానాలు అందుకున్నారు. యానిమేటర్ల సీఓ నగ్మాకు సీమాంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముంజులూరి అనంతలక్ష్మి, వంకా వరలక్ష్మి, కుసుమకుమారి పాల్గొన్నారు.

మహిళలకు తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు



మెడికవర్ ఆస్పత్రిలో మహిళలకు ప్రత్యేక హెల్త్ చెకప్ పోస్టరు ఆవిష్కరించిన దృశ్యం

కాకినాడ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళ ఆరోగ్య పరిరక్షణ కోసం అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రిలో ప్రత్యేక హెల్త్ చెకప్‌కు సంబంధించిన పోస్టర్‌ను తిమ్మాపురం ఎస్‌హెచ్ఎం, ఐపీఎస్ ట్రైనీ సుస్మిత, ఐసీఎంఆర్ డాక్టరు శ్యామల చేతులు మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ మహిళలకు రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కాన్, థైరాయిడ్, విటమిన్స్, గైనిక్, జనరల్ వైద్య పరీక్షలు అతి తక్కువ ఖర్చుతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు గౌతమ్ రామ్ పాల్గొన్నారు.

ఫెడరేషన్ ఐక్యతతో సమస్యల పరిష్కారం


బాలాజీచెరువు: ప్రైవేట్ విద్యాసంస్థల ఫెడరేషన్ ఐక్యతతో సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల ప్రైవేట్ పాఠశాలల వార్షిక సమావేశం ఆదివారం సూర్యకళా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవిజయ్ మాట్లాడుతూ వచ్చే నాలుగు నెలలు ప్రతి పాఠశాలకు అత్యంత కీలకమని, ప్రతి కరస్పాండెంట్ పాఠశాల అభివృద్ధికి కృషిచేసి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఫెడరేషన్ చైర్మన్ దాసరి శ్రీనివాసరావు గతేడాది ఫెడరేషన్ ద్వారా సాధించిన విజయాలు, కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కార్యదర్శి సుజ్ఞాన్, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ కనకరాజు, 600 మందికి పైగా కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

మరిడమ్మ సన్నిధిలో జడ్జి హర్షవర్ధన్ పూజలు


మరిడమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జి హర్షవర్ధన్ దంపతులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి హర్షవర్ధన్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, సిబ్బంది వెంకటరమణ ఆధ్వర్యంలో జడ్జి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయంలో ప్రతి వారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


నాగేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణ సమేత నాగేశ్వర స్వామి దివ్య వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ వేద పండితులు ఆకొండి వేంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆకొండి ప్రభాకర శాస్త్రి స్వామి వారి దివ్య వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం నాగేశ్వర స్వామికి ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం లక్ష బిల్వార్చన రుద్ర హోమం నిర్వహించారు. అపర్ణాదేవికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారి దివ్య కల్యాణోత్సవాలను తిలకించారు.